క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రకృతి వ్యవసాయంలో పంటలను సాగు చేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయంలో పండించే పంటలను తినటం వలన ఆరోగ్యం బాగుంటుందని తెలిపారు. అదే విధంగా భూసారం తగ్గదని, తద్వారా భూమి రక్షించబడుతుందన్నారు. రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ భారతి, ఏపీఎం మునెయ్య పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



సబ్ జైలును సందర్శిస్తున్న జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సెక్రటరీ ఎంఎస్ భారతి

శ్రీకాళహస్తి : రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం ఎస్ భారతి సబ్‌జైలును సందర్శించారు. పరిసరాలు, వంట గది, జైలు గదులు, స్టోర్‌రూంను పరిశీలించారు. అనంతరం ఖైదీలకు చట్టాలపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఏదైనా సమస్య ఉంటే అర్జీ రూపంలో ఇస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అంతకు ముందు శ్రీకాళహస్తి న్యాయస్థాన ఆవరణంలో న్యాయవాదులు, పోలీసులు, పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. మే 10న జరిగే జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలన్నారు.

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

బుచ్చినాయుడుకండ్రిగ : విద్యాహక్కు చట్టం ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా బడిలోనే ఉండాలని మండల విద్యాశాఖాధికారి–2 ముని సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం మండలంలోని కనమనంబేడులో బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కళ్యాణి, ఉపాధ్యాయులు సురేష్ పాల్గొన్నారు.


యంత్ర సాగు లాభదాయకం



యంత్ర పరికరాల పంపిణీలో ఎమ్మెల్యే

నారాయణవనం : సాగు విధానంలో యంత్రాలను వినియోగించడంతో ఖర్చులు తగ్గి లాభాలను గడించవచ్చునని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. శుక్రవారం మండలంలో వివిధ ప్రారంభోత్సవాలలో ఆయన పాల్గొని ప్రసంగించారు. నారాయణవనంలో మినీ తాగునీటి ట్యాంకును ప్రారంభించారు. పాలమంగళంలో పశువుల తాగునీటి తొట్టి నిర్మాణానికి భూమి పూజ చేసిన ఆయన మండల వ్యవసాయ కార్యాలయం వద్ద యంత్ర పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు కోనేటి సుమన్‌కుమార్, ఎంపీపీ దివాకర్‌రెడ్డి, ఎంపీడీఓ గుణశేఖర్, ఏఓ శోభారాణి, ఏపీఓ సుకన్య, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి త్రుటిలో తప్పిన ప్రమాదం



అదుపుతప్పి దూసుకొచ్చిన కారు

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ సుధాకర్‌కు త్రుటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. నాయుడుపేట–పూతలపట్టు జాతీయ రహదారి మర్రిగుంట సర్కిల్ వద్ద శుక్రవారం రాత్రి శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వేగంగా వెళుతున్న కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అంతే వేగంగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సుధాకర్‌పైకి దూసుకెళ్లింది. అప్పుడే అటుగా ఇన్నోవా కారు మధ్యలోకి రావడంతో ఇన్నోవాను ఢీకొట్టింది. దీంతో ఎస్‌ఐకి పెను ప్రమాదం తప్పింది.

ఉపాధి హామీ.. వసతుల లేమి!

స్థానికంగా పనులు కల్పించాలనే లక్ష్యంతో అమలవుతున్న ఉపాధిహామీ పనులు అసౌకర్యాల నడుమ కొనసాగుతున్నాయి. పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. పనులు గ్రామాలకు దూరంగా జరుగుతుండడం.. మరోవైపు మండే ఎండలో చెమటోడ్చి పనిచేసిన వారికి కాసేపు సేద తీరడానికి నిలువ నీడ లేని దుస్థితి నెలకొంది. పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే కనీసం ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేకపోవడం నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా ఉపాధి పనులు మారాయి.

మండు టెండలో పనిచేస్తున్న కూలీలు



- కానరాని కనీస సౌకర్యాలు
- మండుటెండలో పనులు
- పట్టించుకోని అధికారులు

నారాయణవనం : కూలీలకు కేంద్ర ప్రభుత్వం 'ఉపాధి' పనులు కల్పిస్తోంది. కానీ పనులు చేస్తున్న కూలీలకు కనీస సౌకర్యాలను కల్పించడంలో 'ఉపాధిహామీ' అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. గ్రామాలకు దూరంగా అటవీ ప్రాంతాలలో మండుతున్న ఎండలో పనిచేస్తున్న కూలీలకు వసతులు కల్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం అవుతోంది. కానీ వసతులు కల్పించినట్లు రికార్డులు చూపిస్తున్నాయే గాని సౌకర్యాలు మాత్రం ఎక్కడా కానరావడంలేదు. ఉపాధి హామీ పని వేళల్లో కూలీలకు తాగునీటి సౌకర్యం కల్పించాల్సి ఉంది. చంటి పిల్లలను తల్లులు తమతో తీసుకొస్తే సమీపంలోని చెట్ల వద్ద ఊయలలు ఏర్పాటు చేసి కేర్ టేకర్‌ను నియమించాల్సి ఉంది. ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో పాటు కూలీలు భోజనాలు చేయడానికి, సేద తీరడానికి టార్పాలిన్ పట్టలతో నీడ వసతి ఏర్పాటు చేయాల్సి ఉంది. గునపాలు, పారలు, తట్టలు అందిస్తూ నివాస ప్రాంతానికి పని క్షేత్రం అయిదు కిలోమీటర్లు దాటితే రవాణా చార్జీలు, వేసవిలో పనిచేసే కూలీలకు వేసవి అలవెన్స్‌లను చట్టం మేరకు అందివ్వాల్సి ఉంది. అయితే సౌకర్యాలేవీ పనిచేస్తున్న క్షేత్రాల వద్ద కల్పించడం లేదు.

సత్యవేడు నియోజకవర్గంలో ఉపాధి కూలీల వివరాలు.. (మార్చిలో)		
మండలం	పంచాయతీలు	పనిచేసిన కూలీలు
నారాయణవనం	19	2,861
సత్యవేడు	28	4,961
వరదయ్యపాళెం	29	3,065
బీఎన్ కండ్రిగ	28	4,214
కేవీబీ పురం	38	4,475
నాగలాపురం	19	4,754
పిచ్చాటూరు	21	4,131

వాస్తవానికి జరుగుతున్నది ఇదే..

ఉపాధి కూలీలకు చట్టం మేరకు పూర్తి సౌకర్యాలను కల్పించడం లేదు. తాగునీటిని తమతోనే కూలీలు తీసుకెళ్తున్నారు. నీడను, పిల్లల కోసం కేర్ టేకర్, సేద తీరేందుకు టెంట్లను ఏర్పాటు చేయడం లేదు. రవాణా చార్జీలను వేతనంతో కలిపి చెల్లిస్తున్నారు. గడ్డపారలు, తట్టల సరఫరాను ఆపివేస్తూ పరికరాలను అద్దెకు రోజుకు 3 రూపాయల చొప్పున మాత్రమే కూలీలకు అందుతోంది.

ప్రశ్నించే ధైర్యం లేకనే

గ్రామీణ ఉపాధి పథకంలో పని కావాలని అడిగిన ప్రతి కూలీకి 15 రోజుల్లో పని కల్పిస్తూ.. మౌలిక సౌకర్యాలను కల్పించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అయితే ఎక్కడా సౌకర్యాలను కల్పించిన దాఖలాలు లేవు. సౌకర్యాల కల్పన కేవలం మేడిపండు చందంగా మారింది. అధికారులు సౌకర్యాల కల్పనపై శ్రద్ధ చూపడం లేదు. చేసిన పనులకు వేతనం అందకుండా అడ్డుకుంటారని కూలీలు భయపడి ప్రశ్నించడం మానేశారు.

నీడ సౌకర్యం కల్పించాలి



ఊరికి దూరంగా అ టవీ ప్రాంతంలో ఉద యం వెళ్తే .. మిట్ట మ ధ్యాహ్నానికి ఇంటికి చే రుకుంటున్న కూలీల కు కల్పించే సౌకర్యాల ను మెరుగు పరచాలి. అధికారులు సౌకర్యాల ఏర్పాటుపై శ్రద్ధ చూపిస్తే కూలీలకు మేలు చేసిన వారవుతారు. టార్పాలిన్ పట్టలు, పరికరాలు ప్రభుత్వమే సరఫరా చేయాలి.

– ఈశ్వరి, సముదాయం, నారాయణవనం మండలం

భద్రత ఏదీ?



అడవుల్లో పని చేస్తు న్న కూలీలకు భద్రత కల్పించాల్సిన అవస రం ఉంది. పని దినా లు అయిపోతే కుటుంబ సభ్యుల పేర్లతో పనిచేస్తున్న కూలీలకు ప్రమాదం జరిగితే ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందదు. కూలీలందరికీ ప్ర మాద బీమా సౌకర్యాన్ని కల్పించాలి.

– ధర్మయ్య, పుతేరి, బీఎన్ కండ్రిగ మండలం

నేటి నుంచి పంగుణోత్తర ఉత్సవాలు

నారాయణవనం : పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం నుంచి వారం రోజుల పాటు పంగుణోత్తర ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి నాగరాజు, ప్రధాన అర్చకులు శ్రీధర భట్టాచార్య తెలిపారు. ఉత్సవాల్లో ప్రతిరోజు ఉదయం పద్మావతీ అమ్మవారికి అభిషేకం, సాయంత్రం ఊంజల్ సేవను నిర్వహిస్తారన్నారు. చివరి రోజైన ఈనెల 11వ తేదీ శుక్రవారం రాత్రి పద్మావతీ అమ్మవారి సన్నిధిలో ఏకాంత సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఊంజల్ సేవలో అమ్మవారు



అలంకరణలో పద్మావతీ అమ్మవారు

నారాయణవనం : పద్మావతీ అమ్మవారు శుక్రవారం సాయంత్రం ఊంజల్ సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సుప్రభాత సేవతో తెరిచిన అర్చకులు నిత్యపూజా కైంకర్యాలతో ఉదయం 7 గంటలకు వేంకటేశ్వర స్వామికి, 8 గంటలకు పద్మావతీ అమ్మవారికి అభిషేకాలను పూర్తి చేశారు. సాయంత్రం తిరుచ్చి వాహనంపై పద్మావతీ అమ్మవారిని అలంకరించి అధిష్టింపజేశారు. అంతర ప్రాకారంలో ఊరేగిన అమ్మవారు ఊంజల్ మండపంలో ఊయల సేవలో తరించారు. ఆలయ అధికారి నాగరాజు, ఆర్జితం అధికారి భరత్, ప్రధాన అర్చకులు శ్రీధరభట్టాచార్యులు, శ్రీనివాస భట్టాచార్యులు, నరసింహభట్టాచార్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం



విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న నేతలు

శ్రీకాళహస్తి : పట్టణంలోని చెంచులక్ష్మి కాలనీ వద్ద ఉన్న పెన్షనర్స్ భవనంలో శుక్రవారం పెన్షనర్ల దినోత్సవాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా చాగనం ట్రస్టు చైర్మన్ చాగనం గౌరీ శంకరరావు మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగులు చేస్తున్న సేవలను అభినందించారు. అనంతరం ఆ సంఘం సేవలకు రూ.50 వేల రూపాయలు విరాళాన్ని పెన్షనర్స్ అధ్యక్షుడు వెంకయ్యకు అందించారు. అనంతరం విశ్రాంత ఉద్యోగుల రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పెన్షనర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్స్ డే సందర్భంగా కార్యక్రమానికి మాజీ పాలకమండలి అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు స్వామి, అమ్మవారి చిత్రపటాలను అందజేశారు. 25 మందిని సన్మానించి జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ సంఘం సహాయ అధ్యక్షుడు పురుషోత్తం గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి వెంకట రమణయ్య, రాష్ట్ర సహాయ అధ్యక్షుడు గురు రాజారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరామనాయుడు, మహబూబ్ బాషా, కోశాధికారి సిద్దయ్య, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చంద్రశేఖర్, జేఏసీ చైర్మన్ చెంచురత్నం తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చారిత్రక నిర్ణయం



మాట్లాడుతున్న సోము వీర్రాజు

రేణిగుంట(శ్రీకాళహస్తిరూరల్) : వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు దేశంలో అణగారిన ముస్లిం వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందని, ఇది చారిత్రకమని బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. రేణిగుంట విమానాశ్రయంలో శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. ఏ వర్గానికి ద్రోహం చేసే ఆలోచన బీజేపీకి లేదన్నారు. ఈ బిల్లు వల్ల అన్ని విధాలుగా ముస్లింల విస్తృత ప్రయోజనాలు సాధ్యమవుతాయన్నారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమలు రానున్నాయన్నారు. రాష్ట్ర రాజధాని, విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి చిత్తశుద్ధితో సహకారం అందిస్తున్నామన్నారు. స్వాగతం పలికిన వారిలో కోలా ఆనంద్, సామంచి శ్రీనివాస్, జల్లిమధుసూదన్‌యాదవ్, బీడీ బాలాజీ, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి తపాలా మహాసభలు



మాట్లాడుతున్న పోస్టల్ ఉద్యోగ సంఘం నేతలు

రేణిగుంట : శ్రీకాళహస్తి పట్టణంలో ఈనెల 6వ తేదీ నుంచి 8వ తేదీ వరకు అఖిల భారత తపాలా ఉద్యోగుల సంఘం పోస్ట్‌మెన్, ఎంటీఎస్ రాష్ట్ర శాఖ మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం స్థానిక రిసెప్షన్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.మురళీ, ప్రధాన కార్యదర్శి బి.శ్రీధర్ బాబు తెలిపారు. పట్టణంలోని మహేష్ కళ్యాణ్ సదన్‌లో ఈ మహాసభలు జరగనున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తిలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర స్థాయిలో ఇక్కడ నిర్వహిస్తున్న మహాసభలలో పలు కీలక అంశాలపై చర్చించి భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించే అవకాశం ఉందన్నారు. తపాలా ప్రైవేటీకరణలో భాగంగా పీఓఎస్‌బీ ఖాతాలను ఐపీపీబీకి మళ్లించడం ద్వారా చిన్న మొత్తాల పొదుపు విభాగం పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల చేతిలో వెళ్లే అవకాశం ఉందని తెలిపారు. ఈ ప్రయత్నాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే మానుకుని తపాలా ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపాలా ఉద్యోగుల సంఘం రిసెప్షన్ కమిటీ చైర్మన్ ఖుర్షిద్ బేగం, వర్కింగ్ ప్రెసిడెంట్ మదన్ మోహన్ రెడ్డి, ఏఐపీఈయూ గ్రూప్ సీ తిరుపతి డివిజన్ అధ్యక్షుడు వై.శేషాద్రి, కార్యదర్శి మధు బాబు, శ్రీకాళహస్తి బ్రాంచి కార్యదర్శి ఎం.వెంకటేశ్వర్లు, ఏఐజీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి కె.నాగయ్య, నాయకులు పాల్గొన్నారు.

నవమి ఉత్సవాలకు ముస్తాబు

- పెద్ద పాండూరులో 6 నుంచి వేడుకలు

వరదయ్యపాళెం : మండలంలోని పెద్ద పాండూరులోని సీతా సమేత శ్రీ కోదండ రాముడి ఆలయం శ్రీరామనవమి ఉత్సవాలకు ముస్తాబైంది. 6వతేదీ నుంచి 8వతేదీ వరకు మూడు రోజుల పాటు నవమి ఉత్సవాలు జరగనున్నట్లు ఆలయ అర్చకుడు నిరంజనాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయానికి నూతన రంగులతో విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేస్తున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్ల కల్యాణం జరగనుంది. 7న సోమవారం స్వామి వారి పట్టాభిషేకం, 8న శుక్రవారం వసంతోత్సవం జరగనుంది. సమీప గ్రామాల నుంచి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానుండడంతో ఆలయ ధర్మకర్త, విశ్రాంత ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీరు పరంధామరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేస్తున్నారు.



సీతా సమేత శ్రీ కోదండరామస్వామి



రాష్ట్ర మంత్రికి సాదర స్వాగతం



మంత్రి నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న జేసీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : తిరుపతి జిల్లా మూడు రోజుల పర్యటన నిమిత్తం శుక్రవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, ఎమ్మెల్యే అరణి శ్రీనివాసులు, రైల్వే కోడూరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ శ్రీధర్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం వెంకటగిరి మండలంలో జరిగే కార్యక్రమానికి రోడ్డు మార్గాన బయలుదేరి వెళ్లారు.

వివాదాస్పద భూమిలో దౌర్జన్యం

రేణిగుంట(శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం కృష్ణాపురం గ్రామ సర్పంచ్ ముద్దురాయులకు చెందిన భూమిలో తిరుపతికి చెందిన చెరుకూరి సుగుణవతి తన 10 మంది అనుచరులతో వచ్చి శుక్రవారం సరిహద్దు రాళ్లను తొలగించి జేసీబీతో చదును చేశారు. సర్పంచ్ సోదరుడు ఈ 60 సెంట్లు భూమిని తనకు విక్రయించాడని, తన వద్ద భూమికి సంబంధించి డాక్యుమెంట్లు ఉన్నాయని సుగుణవతి చెబుతున్నా, ఈ భూమి దశాబ్దాల తరబడి తన అనుభవంలో ఉంటే ఎలా కొనుగోలు చేసి దౌర్జన్యంగా తన పొలంలోకి ప్రవేశిస్తారని సర్పంచ్ ముద్దురాయులు అడ్డుకున్నారు. దౌర్జన్యంగా తమ పొలాన్ని చేజిక్కించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని సర్పంచ్ రేణిగుంట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కొనసాగుతున్న చెరువు వివాదం

శ్రీకాళహస్తి : చుక్కలనిడిగల్లు, టీఎంవీకండ్రిగ వద్ద చెరువు వివాదం కొనసాగుతోంది. శుక్రవారం మళ్లీ రోడ్డు తవ్వడంతో చుక్కలనిడిగల్లు గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ వెంటనే జోక్యం చేసుకుని చెరువు ఎవరిదో తేల్చాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో స్పందనలో కలెక్టర్‌కు విన్నవించనున్నట్లు తెలిపారు. ఈ విషయంపై ఎంపీడీఓ రఫీ ఖాన్ వివరణ కోరగా రెండు గ్రామాల మధ్య చెరువు వివాదం జరుగుతోంది. దానిపై ఇరిగేషన్, రెవెన్యూ అధికారుల వివరణ కోరామని వారు ఇచ్చే సమాధానం మేరకు సమస్య పరిష్కారం చేస్తామన్నారు.

బహిరంగ మద్యపానం నిషేధం

శ్రీకాళహస్తి : బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ గోపి అన్నారు. పట్టణంలోని తుఫాన్ సెంటర్‌లో శుక్రవారం హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి: పట్టణానికి చెందిన విక్రమ్ నెక్స్ట్ జెన్ విద్యార్థులు ప్రతిభ చూపారు. జాతీయ స్థాయి సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్, యూనిఫైడ్ ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్ ఒలింపియాడ్‌లో 2 నుంచి 8వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 23 మందికి బంగారు పతకాలు, ఐదుగురికి నగదు బహుమతి, ఆరుగురు పుస్తక బహుమతి సాధించారు. వీరిని శుక్రవారం కరస్పాండెంట్ మునిలక్ష్మి అభినందించారు. ప్రిన్సిపల్ ఉమాదేవి పాల్గొన్నారు.



విద్యార్థులతో కరస్పాండెంట్ మునిలక్ష్మి

పారిశ్రామికవేత్తలుగా రాణించాలి



బహుమతి ప్రదానం చేస్తున్న ఏఎంఓ

రేణిగుంట : రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఈఎండీపీ (ఎంటర్‌ప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం) పోటీలు జరిగాయి. జిల్లా సమగ్రశిక్ష ఏఎంఓ శివశంకరయ్య, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, జోనల్ మేనేజర్ నీలిమ పాల్గొని విద్యార్థులు వినూత్న శైలిలో ఆలోచన చేసి భవిష్యత్తులో గొప్ప ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని కోరారు. వివిధ మండలాల నుంచి ప్రదర్శించిన ప్రాజెక్టులు పరిశీలించి, రేణిగుంట బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన సేఫ్టీ స్టిక్ ప్రాజెక్టుకు మొదటి బహుమతి, ఎడిబుల్ ప్లేట్స్ అండ్ కప్స్ ప్రాజెక్టుకు చిట్టమూరు మండలం మెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులకు ద్వితీయ బహుమతి, ఆర్టిఫిషియల్ ఫ్రూట్ రిపెన్ డిక్టేటర్ ప్రాజెక్టును ప్రదర్శించిన కరకంబాడి ఉన్నత పాఠశాల విద్యార్థులకు తృతీయ బహుమతులను ప్రాజెక్టు మేనేజర్ అనిత అందజేశారు. ప్రాజెక్ట్ పోటీలకు జిల్లాలో 40 పైగా పాఠశాలలు పాల్గొన్నాయి.

అధ్వాన్నంగా కాలువలు



రేణిగుంట రైల్వే స్టేషన్ సమీపంలోని కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మేజర్ పంచాయతీలోని కాలువలు అధ్వాన్న స్థితికి చేరాయి. పట్టణంలోని ప్రధాన కాలువల్లో వ్యర్థాలు పూర్తి స్థాయిలో చేరుకొని దుర్వాసన వెదజల్లుతోంది. ప్రధానంగా రైల్వేస్టేషన్ సమీపంలోని ప్రధాన కాలువలో హోటల్ నిర్వాహకులు వ్యర్థాలను వేయడంతో కాలువ మొత్తం నిండిపోయి దుర్వాసన వస్తోంది. యాత్రికులు, ప్రయాణికులు ముక్కు మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. పట్టణంలో ప్రధాన కాలువలను పర్యవేక్షణ చేయాల్సిన పంచాయతీ అధికారులు అసలు అటువైపు చూడకపోవడంతో సమస్య తీవ్రమైంది. దానికి తోడు కాలువపైన విచ్చలవిడిగా కట్టడాలు నిర్మించుకోవడం పెద్ద సమస్యగా మారింది. పాలకులు, అధికారులు ఎవరికి వారు తమకు ఎందుకులే అనే విధంగా వ్యవహరించడంతో సమస్యను తీర్చే నాథుడే కరువయ్యారు. కనీసం కాలువలో ఉన్న వ్యర్థాలను తొలగించి, వ్యర్థాలు వేసే హోటల్ నిర్వాహకులకు హెచ్చరికలు జారీ చేస్తే తప్ప సమస్య పరిష్కారం కాదు. కానీ ఆ ఆలోచన మాత్రం ఏ అధికారి చేయకపోవడం శోచనీయం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు రేణిగుంటపై ప్రత్యేక శ్రద్ధ వహించి స్వచ్ఛ రేణిగుంట కలను సాకారం చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

కారు–ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు



ప్రమాద స్థలంలో కారు, ద్విచక్ర వాహనం

శ్రీకాళహస్తి : కారు–ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన తొట్టంబేడు మండలం బీడీ కాలనీ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. తొట్టంబేడు పోలీసుల కథనం మేరకు తొట్టంబేడు మండలం కొత్తపాళెంకు చెందిన శంకర్‌రెడ్డి సొంత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి బయలుదేరాడు. మార్గ మధ్యలో తొట్టంబేడుం మండలం బీడీ కాలనీ వద్ద చెన్నై వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో శంకర్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. తొట్టంబేడు పోలీసులు అక్కడికి చేరుకుని క్షతగాత్రున్ని చికిత్స నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తరలించారు. తొట్టంబేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.